నమస్తే తెలంగాణ
వికారాబాద్
I | హైదరాబాద్, సోమవారం 2 జూన్ 2025 | VIKARABAD

వరల్డ్ బైస్కిల్ డేను పురస్కరించుకొని హైదరాబాద్ సైక్లిస్ట్ గ్రూప్ ఆధ్వర్యంలో ఆదివారం ట్యాంక్‌బండ్ వద్ద గల 125 అడుగుల అంబేద్కర్ విగ్రహం వద్ద బైస్కిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని కస్టమ్స్ అండ్ జీఎస్టీ చైర్మన్ నరసింహారెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. 8 సంవత్సరాలుగా ఈ ర్యాలీ నిర్వహిస్తున్నామని, ఈ సందర్భంగా గ్రామీణ ప్రాంతాల్లో చదువుకునే పేద విద్యార్థినులకు ఉచితంగా సైకిళ్లను పంపిణీ చేస్తున్నామని హైదరాబాద్ సైక్లిస్ట్ గ్రూప్ వ్యవస్థాపకుడు రవీందర్ తెలిపారు. - ఖైరతాబాద్, జూన్ 1

కొత్తగా ఇర్విన్ చిచ్చు

- రంగారెడ్డి జిల్లాలో కొనసాగుతున్న భూసేకరణ లొల్లి
- ఓ వైపు ఫార్మా.. మరోవైపు గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు
- ఇర్విన్‌లో రిజర్వాయర్ నిర్మాణానికి ప్రభుత్వం యోచన
- భూములిచ్చేందుకు ససేమిరా అంటున్న రైతులు
- సాగు భూములిచ్చి తామెలా జీవించాలని మండిపాటు
- అయినా పట్టుదలకు పోయి.. సేకరిస్తున్న ప్రభుత్వం
- బలవంతంగా లాక్కోవాలని చూస్తే ఆత్మహత్య చేసుకుంటామని అన్నదాతల హెచ్చరిక



గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు ఏర్పాటుకు భూములిచ్చినవారికి తగిన పరిహారం చెల్లించాలని ఆందోళన చేస్తున్న భూబాధితులు

రంగారెడ్డి, జూన్ 1 (నమస్తే తెలంగాణ) : జిల్లాలో భూసేకరణకు రైతులు ముందుకు రావడంలేదు. భూముల ధరలు పెరిగిపోతున్న నేపథ్యంలో ప్రభుత్వం వివిధ అవసరాల పేరుతో చేపడుతున్న భూసేకరణపై ప్రజల నుంచి తీవ్ర స్థాయిలో వ్యతిరేకత వస్తున్నది. రైతులు అడుగడుగునా అడ్డు తగులుతున్నారు. భూముల నుంచి తమను విడదీయొద్దని వేడుకుంటున్నారు. నిన్న మొన్నటి వరకు ఫార్మాసిటీ భూముల చుట్టూ అధికారులు ఫెన్సింగ్ పనులను చేపట్టగా రైతులు అడ్డుకున్నారు. మరోవైపు రైతులకు చెందిన 2,500 ఎకరాల పట్టా భూములను ప్రభుత్వం పరిహారం చెల్లించకుండానే సర్కారు పేరుతో మార్చుకోవడంతో రైతులు పోరాడుతున్నారు. అదేవిధంగా, ఫ్యూచర్ సిటీ కోసం కొంగరకలాన్ ఓఆర్ఆర్ నుంచి ప్రతిపాదిత రీజినల్ రింగ్ రోడ్డు వరకు 330 ఫీట్లతో గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు ఏర్పాటుకు ప్రభుత్వం నిర్ణయించి.. ఇందుకోసం 1000 ఎకరాల భూమిని సేకరించేందుకు సిద్ధంగా కాగా.. రైతులు తమ భూములను ఇచ్చేందుకు ససేమిరా అంటున్నారు. అయినప్పటికీ ప్రభుత్వం పోలీసు పహారాలో గ్రీన్ ఫీల్డ్ రోడ్డుకు తీసుకునే భూముల్లో హద్దులను నిర్ధారించింది. దీంతో గ్రీన్ ఫీల్డ్, ఫార్మా భూములకు వ్యతిరేకంగా ఆందోళన కార్యక్రమాలు కొనసాగుతూనే ఉన్నాయి.

ఫార్మా భూములపై నిరసన వ్యక్తం చేస్తున్న ఆందోళనకారులను అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

రిజర్వాయర్ నిర్మాణాన్ని రద్దు చేయాలి

మాడ్గుల మండలంలోని ఇర్విన్‌లో ప్రభుత్వం నిర్మించ తలపెట్టిన రిజర్వాయర్‌ను వెంటనే రద్దు చేయాలని ఆ గ్రామ రైతులు తీవ్ర స్థాయిలో ఆందోళన చేపడుతున్నారు. గ్రామంలోని సుమారు 1075 ఎకరాల్లో రిజర్వాయర్‌ను నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ రిజర్వాయర్ నిర్మాణం పూర్తైతే గ్రామంలోని సగం మంది రైతుల భూములు పోయి రోడ్డున పడే పరిస్థితి వస్తుందని.. తాము ఎలా బతకాలని వారు ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నారు. శనివారం రిజర్వాయర్ నిర్మాణానికి భూములిచ్చే ప్రసక్తే లేదని కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేపట్టి.. తమ నిరసనను తెలిపారు. తమ భూములను తీసుకుంటే.. భూమికి భూమికి ఇవ్వాలని.. లేదా.. బయట మార్కెట్ ప్రకారం ఎకరానికి రూ.కోటి నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. భూములను బలవంతంగా లాక్కోవాలని చూస్తే మూకుమ్మడిగా ఆత్మహత్య చేసుకుంటామని హెచ్చరించారు.

భూములిస్తే ఎలా బతకాలి..

అభివృద్ధి కార్యక్రమాల పేరుతో ప్రభుత్వం యాచారం మండలంలోని మొండిగౌరెల్లి, కందుకూరు మండలంలోని తిమ్మాపూర్, లేమూరు తదితర గ్రామాల్లో భూసేకరణకు ఏర్పాట్లు చేస్తున్నది. అయితే ఆ భూములను ప్రభుత్వం పేదలకు పంపిణీ చేసి సరిఫికెట్లు కూడా ఇచ్చింది. అదేవిధంగా సరూర్‌నగర్ మండలంలోని గుర్రంగూడ.. బాలాపూర్ మండలంలోని కురుమలగూడ తదితర గ్రామాల్లోని పేదల భూములను సర్కార్ తీసుకోవాలని యత్నిస్తుండగా.. తమ భూములను ఇచ్చే ప్రసక్తే లేదని రైతులు స్పష్టం చేస్తున్నారు. తమ భూములను ప్రభుత్వానికి ఇస్తే ఎలా బతకాలని ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నారు.

ఇర్విన్‌లో రిజర్వాయర్ నిర్మాణానికి భూములివ్వబోమని, నిర్మాణాన్ని రద్దు చేయాలని కలెక్టరేట్ ఎదుట ప్లకార్డులను ప్రదర్శిస్తున్న మహిళా రైతులు

అమరుల త్యాగాలు స్మరించుకుందాం..

- రాష్ట్ర సాధనకు కేసీఆర్ సుదీర్ఘ పోరాటం
- చావు నోట్లో తలపెట్టి రాష్ట్రం సాధించారు..
- జాతీయ పతాకాలను ఎగురవేద్దాం..
- బీఆర్ఎస్ పార్టీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు కిషన్‌రెడ్డి

రంగారెడ్డి, జూన్ 1 (నమస్తే తెలంగాణ) : జిల్లాలో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని సోమవారం బీఆర్ఎస్ ఆధ్వర్యంలో గ్రామగ్రామాన ఘనంగా నిర్వహించాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఎన్నో పోరాటాల ఫలితంగానే రాష్ట్రాన్ని సాధించుకున్నామన్నారు. అమరవీరుల త్యాగాలను గుర్తు చేసుకుంటూ ప్రతి గ్రామంలో నూ జాతీయ జెండాను ఆవిష్కరించాలన్నారు. అమరవీరుల చిత్రపటాలకు పూలమాలలు వేస్తూ ఘనంగా నివాళులర్పించాల్సిన బాధ్యత మనందరిపై ఉన్నదన్నారు. మాజీ సీఎం కేసీఆర్ రాష్ట్ర సాధనకు సుదీర్ఘ పోరాటం చేశారని, చావు నోట్లో తలపెట్టి ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించారన్నారు. పదేండ్ల కేసీఆర్ పాలనలో తాగు, సాగు నీరందించారన్నారు. తెలంగాణ అనేక రాష్ట్రాలకు దిక్సూచిగా నిలిచిందన్నారు. జాతీయ దినోత్సవాల్లో ఎలా సంబురాలు జరుపుకొంటామో.. సోమవారం కూడా జాతీయ పతాకాన్ని ఎగురవేసి సంబురాలు చేసుకోవాలన్నారు.

నార్త్ సిటీకి మెట్రో ఇంకెప్పుడు?

150 రోజులుగా ఎదురుచూస్తున్న అక్కడి ప్రజలు

సిటీబ్యూరో, జూన్ 1(నమస్తే తెలంగాణ) : నార్త్ సిటీ ప్రజల ఆకాంక్షలను నెరవేర్చాలంటూ 150 రోజులుగా ఎదురుచూస్తున్నారు. మెట్రో విస్తరణ పేరిట ఆ ప్రాంతానికి రెండు మార్గాల్లో మెట్రో మార్గాన్ని తీసుకువస్తామంటూ సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారే తప్పా.. ఇప్పటికీ డీపీఆర్ పూర్తి చేయలేకపోయారు. ఇక తమ ప్రాంతానికి ఎంతో కీలకమైన మెట్రో డీపీఆర్ ఇంకెప్పుడూ అంటూ మేడ్చల్ మెట్రో సాధన సమితి ఆందోళన చెందుతున్నది. నార్త్ సిటీ మెట్రో నిర్మాణంలో కీలకమైన సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్)ను మార్చి 31లోపు ప్రభుత్వానికి డీపీఆర్ అందజేయాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించినా... ఇప్పటికీ రూపకల్పన ప్రక్రియ సాగుతున్నదని మెట్రో రైలు సంస్థ వెల్లడించడంపై మేడ్చల్ మెట్రో సాధన సమితి ఆగ్రహం వ్యక్తం చేస్తున్నది. ఈ క్రమంలో నిర్ణీత గడువులోగా, ఇచ్చిన హామీ ప్రకారం డీపీఆర్ కేంద్రానికి అందజేయాలని, ఆ వెంటనే ఆమోదంతో పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు. నార్త్ సిటీ ప్రజలకు కొత్త ఏడాది కానుకగా మెట్రో నిర్మాణంపై సీఎం ప్రకటన చేశారు. మార్చి 31లోపు డీపీఆర్ రూపొందిస్తామని హామీ ఇచ్చారు. కానీ గడిచిన 150 రోజులుగా ఇచ్చిన హామీకి ఎలాంటి రూపం లేకుండా పోయిందన్నారు. నిత్యం ట్రాఫిక్ సమస్యలతో ఓవైపు కాలుష్య తీవ్రత, మరోవైపు అనారోగ్య సమస్యలు ఈ ప్రాంత వాసులను చుట్టుముడుతున్నాయన్నారు. డీపీఆర్ తయారీకి నెలల కొద్ది సమయం తీసుకుంటే... ఇక నిర్మాణం ఇంకెప్పుడూ చేస్తారంటూ ప్రశ్నించారు. తక్షణమే నార్త్ సిటీ డీపీఆర్ సిద్ధం చేయాలని, తమ ప్రాంత ప్రజల ఆకాంక్షలను నెరవేర్చాల్సిన ప్రభుత్వం మెట్రో నిర్మాణం విషయంలో ఎందుకు జాప్యం చేస్తున్నదో సమాధానం చెప్పాలని మేడ్చల్ మెట్రో సాధన సమితి డిమాండ్ చేసింది.

యుద్ధ ప్రాతిపదికన పనులు చేయండి

సిటీబ్యూరో, జూన్ 1 (నమస్తే తెలంగాణ) : మలక్‌పేటలో డ్రైనేజీ నీరు ఉప్పొంగడంతో ఏర్పడిన ట్రాఫిక్ జామ్ నివారణకు జలమండలి, జీహెచ్ఎంసీ సంయుక్తంగా చేపట్టిన పనులను కమిషనర్ ఆర్‌వీ కర్ణన్ ఆదివారం అధికారులతో కలిసి పరిశీలించారు. వీలైనంత త్వరగా పనులను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం ట్రాఫిక్ జామ్‌కు అవకాశం లేదని, యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేస్తున్నామని, భవిష్యత్‌లో సమస్య రాకుండా చర్యలు తీసుకుంటున్నట్లు ఎస్ఈ మహేశ్వర్‌రెడ్డి వివరించారు. అనంతరం నెక్లెస్ రోడ్డు రైల్వే స్టేషన్ నుంచి కుందన్‌బాగ్ వరకు చేపట్టే ఆర్‌డీపీ పనులను పరిశీలించారు. కమిషనర్ వెంట మెయింటెనెన్స్ సీఈ సహదేవ్ రత్నాకర్, జలమండలి అధికారులు ఉన్నారు.

నల్లచెరువు గ్రామంలో ఇందిరమ్మ ఇల్లురాని గుడిసె

కాంగ్రెస్ కార్యకర్తల కుటుంబాలకే ఇందిరమ్మ ఇండ్లా..?

మాడ్గుల, జూన్ 1 : మండల పరిధిలోని నల్లచెరువు గ్రామంలో పూరి గుడిసెలున్న నిరుపేద కుటుంబాలకు ఇందిరమ్మ ఇండ్లు రాకపోవడం చాలా దురదృష్టకరమని ప్రజలు వాపోతున్నారు. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల కుటుంబాలకు మాత్రమే ఇందిరమ్మ ఇండ్లు వచ్చాయని మండల ప్రజలు మండిపడుతున్నారు. భూమి కలిగినవారికి ఇందిరమ్మ ఇల్లు ఎలా ఇస్తారని మండలవాసులు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నారు. ఇండ్లు లేక పూరి గుడిసెల్లో, మట్టి మిద్దెల్లో, రేకుల ఇళ్లల్లో జీవనం సాగిస్తున్నామని వారి కన్నీరు మున్నీరవుతున్నారు. తమ బాధలు ఎవరికి చెప్పుకోవాలని ఆవేదనకు గురవుతున్నారు. కాంగ్రెస్ సర్కారు ఇప్పటికైనా ఇండ్లు లేని నిరుపేదలకు ఇండ్లు ఇవ్వాలన్నారు. స్థానిక ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి స్పందించి పేదవారికి ఇండ్లు వచ్చేలా దయ తలచాలని వారు కోరుతున్నారు.

నాకు రెండు కళ్లు లేవు

నాకు రెండు కళ్లు లేవు. నల్లచెరువు గ్రామంలో నాకు ఇల్లు లేదు. భూమి అర ఎకరం మాత్రమే ఉన్నది. నాకు ఇద్దరు కొడుకులు. హైదరాబాద్‌లో అద్దెకుంటున్నాం. నాలాంటి పేదవాడికి ఇందిరమ్మ ఇల్లు ఇచ్చి కుటుంబాన్ని ఆదుకోవాలి.

- రామచంద్రయ్య, అంధుడు, నల్లచెరువు

భయంతో బతుకుతున్నాం

నాకు పూరి గుడిసె ఉంది. 8 సంవత్సరాల నుంచి ఇద్దరు పిల్లలతో జీవనం సాగిస్తున్నాం. రాత్రయితే చాలు పాములు, తేళ్లు వస్తున్నాయి. భయంతో బిక్కుబిక్కుమని బతుకుతున్నాం. నాకు ఇందిరమ్మ ఇల్లు రాలేదు. సర్కారు స్పందించి ఇల్లు ఇచ్చి ఆదుకోవాలని కోరుతున్న.

- పద్మ, నల్లచెరువు, మాడ్గుల మండలం

కూలిపోయే దశలో మట్టి మిద్దె

నాకు మట్టి మిద్దె ఇల్లు కలదు. నాకు ఇందిరమ్మ ఇల్లు రాలేదు. పేదవారికి ఇందిరమ్మ ఇండ్లు వస్తాయని ఆశిస్తున్నా. ప్రస్తుతం మేము వృద్ధులం. ఉన్న ఇల్లు వర్షాలు వస్తే కూలిపోయే దశలో ఉన్నది. ఇందిరమ్మ ఇల్లు ఇచ్చి మమ్మల్ని ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరుతున్నా.

- పళ్ళ రాములు, మాడ్గుల మండలం

కాంగ్రెస్ హామీ ఏమాయె..!

- పింఛన్ల పెంపు లేదు.. కొత్త పింఛన్లకు మోక్షం లేదు..
- 18 నెలలు దాటినా ఇంకా ఎప్పుడు పెంచుతారు
- రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్న ఆసరా పింఛన్ లబ్ధిదారులు
- వికారాబాద్ జిల్లాలో కొత్త పింఛన్ల కోసం ఆశగా ఎదురు చూస్తున్న 30,000 పైగా లబ్ధిదారులు

వికారాబాద్, జూన్ 1 (నమస్తే తెలంగాణ) : కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 18 నెలలు దాటుతున్నా పేదలకిచ్చిన హామీలు మాత్రం నెరవేరడంలేదు. కేవలం ఆరు గ్యారెంటీలు, ఒకట్రెండు పథకాల గురించి ప్రస్తావించడం మినహా మిగతావాటి ఊసే లేదు. ముఖ్యంగా ఆసరా లబ్ధిదారులకు పింఛన్ పెంచుతామని ఇచ్చిన హామీని ఇప్పటికీ పట్టించుకోవడంలేదు. ఎన్నికలకు ముందు తాము అధికారంలోకి రాగానే వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు తదితరులకిచ్చే రూ.2016 పింఛన్‌ను రూ.4,000., దివ్యాంగులకిచ్చే పింఛన్‌ను రూ.4016 నుంచి రూ.6,000లకు పెంచుతామని హామీనిచ్చారు. కాంగ్రెస్ పార్టీ మాటలు నమ్మి ఓటేసి గెలిపించిన పింఛన్‌దారులు పింఛన్ల పెంపు ఎప్పుడో అంటూ ఆశగా ఎదురుచూస్తున్నారు. ఆరు గ్యారెంటీలు, రైతు భరోసా, ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇండ్లు అంటూ ప్రచారం చేస్తున్నా ప్రతి పథకంలోనూ ఏదో ఒక కొర్రీ పెట్టి అర్హులను లబ్ధిదారుల జాబితాల నుంచి తొలగిస్తుండడంతో పేదలకు పథకాల ఫలాలు అందడంలేదు. అదేవిధంగా కొత్త పింఛన్లను జారీ చేస్తామని చెప్పినా.. ఇప్పటికీ పాత పింఛన్లే ఇస్తుండడంతోపాటు ఆసరా లబ్ధిదారులకు ప్రతినెలా అందించే పింఛన్ డబ్బుల పంపిణీలోనూ తీవ్ర జాప్యం జరుగుతున్నది. పింఛన్ల కోసం కొత్తగా 30 వేలకుపైగా అర్హులైన లబ్ధిదారులు ఎప్పుడెప్పుడు మంజూరు చేస్తారా..? అని ఎదురుచూస్తున్నారు.

ప్రతి నెలా జాప్యమే..

ఆసరా పింఛన్‌తోనే బతుకుతున్న పండుటాకులు, దివ్యాంగులకు కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టిన మొదటి నెల నుంచే పింఛన్ల పంపిణీలో జాప్యం జరుగుతున్నది. వికారాబాద్, తాండూరు, పరిగి నియోజకవర్గాల్లోని పింఛన్‌దారులకు డబ్బుల పంపిణీ ప్రతి నెలా 29 లేదా 30న ప్రారంభమై వారం రోజుల్లో ముగుస్తుండగా.. కొడంగల్ నియోజకవర్గంలోని పింఛన్‌దారులు మాత్రం డబ్బుల కోసం మొదటి వారం పూర్తయ్యే వరకు ఎదురుచూడాల్సిన దుస్థితి నెలకొన్నది. బీఆర్ఎస్ హయాంలో ప్రతి నెలా 20లోగా పింఛన్లను పంపిణీ చేయగా.. కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టిన మొదటి నెల నుంచే ఆసరా పింఛన్ల పంపిణీ ఆలస్యం అవుతుండడంతో పింఛన్‌దారుల్లో అయోమయం నెలకొన్నది. అయితే, కొడంగల్ నియోజకవర్గానికి మహబూబ్‌నగర్ జిల్లా నుంచి ఆసరా పింఛన్ల నిమిత్తం నిధులు మంజూరవుతుండగా.. వికారాబాద్, తాండూరు, పరిగి నియోజకవర్గాలకు రంగారెడ్డి జిల్లా నుంచి నిధులు వస్తున్నాయి. కాగా, జిల్లాలో 98,793 మంది పింఛన్‌దారులకు ప్రతి నెలా రూ.24.38 కోట్ల పింఛన్ డబ్బులను పంపిణీ చేస్తున్నారు.

దేశంలో ఎక్కడాలేని విధంగా పింఛన్లు పెంచిన బీఆర్ఎస్

ఆసరా పథకాన్ని అమల్లోకి తీసుకొచ్చి వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు అండగా నిలువడంతోపాటు దేశంలో ఎక్కడా లేని విధంగా పింఛన్ డబ్బులను గత బీఆర్ఎస్ ప్రభుత్వం పెంచింది. వృద్ధులు, వితంతువులు, తదితరులకిచ్చే రూ.200 పింఛన్‌ను రూ.1000లకు, దివ్యాంగులకిచ్చే రూ.500 పింఛన్‌ను రూ.1500లకు, తదనంతరం రెండోసారి అధికారంలోకి వచ్చిన వెంటనే ఆసరా పింఛన్లను రూ.1000 నుంచి రూ.2016లకు, దివ్యాంగుల పింఛన్లను రూ.1,500 నుంచి రూ.3,016లకు .. తదనంతరం దివ్యాంగులకు ఇచ్చిన హామీ మేరకు రూ.4,016లకు పెంచి పేదల ప్రభుత్వంగా బీఆర్ఎస్ నిలిచింది.

సకాలంలో వైద్యం ఎండమావే..!

సిటీబ్యూరో, జూన్ 1 (నమస్తే తెలంగాణ) : నిత్యం పేద ప్రజలకు అందుబాటులో ఉంటూ వందలాది మంది రోగులకు వైద్యసేవలందించే ఏరియా ఆసుపత్రుల్లో సిబ్బంది కొరత వెంటాడుతున్నది. సరిపడా సిబ్బంది లేకపోవడంతో ఉన్నవారిపైనే అధిక భారం పడుతున్నది. మరోవైపు సిబ్బంది కొరత కారణంగా సకాలంలో వైద్యమందించడంలో ఏరియా ఆసుపత్రులు విఫలమవుతున్నాయి. ఇటీవల జరిగిన బదిలీల్లో పలువురు ఇతర జిల్లాలకు వెళ్లడం మూలంగా ఖాళీలు ఏర్పడ్డాయి. కాంగ్రెస్ ప్రభుత్వం వాటిని రెగ్యులర్ వారితో భర్తీ చేయకపోవడంతో సకాలంలో వైద్యమందక రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

ఏరియా ఆసుపత్రుల్లో సిబ్బంది కొరత

హైదరాబాద్ జిల్లాలోని నాంపల్లి, మలక్‌పేట, గోల్కొండ ప్రాంతాల్లో ఉన్న 100 పడకల ఏరియా ఆసుపత్రులు తెలంగాణ వైద్య విధాన పరిషత్(టీవీవీపీ) పరిధిలో పనిచేస్తూ బస్తీ, యూపీహెచ్‌సీల తరువాత వైద్యసేవలందించడంలో ముందున్నాయి. చాలా వరకు అత్యవసరపు చికిత్సలు, శస్త్ర చికిత్సలు, ప్రసవాలు ఏరియా ఆసుపత్రుల్లోనే జరుగుతుండటం గమనార్హం. కానీ వాటిల్లో సరిపడా సిబ్బంది లేక ఖాళీలు దర్శనమిస్తున్నాయి. జనరల్ మెడిసిన్, జనరల్ సర్జన్, పిడియాట్రిక్స్, గైనకాలజీ, అనస్తీషియా, ఫార్మసిస్టు, రేడియాలజిస్టు పోస్టులు భర్తీకి దూరంగా ఉన్నాయి. నాంపల్లి ఏరియా ఆసుపత్రిలో ఏడుగురు సివిల్ సర్జన్లు కావాల్సి ఉండగా, ముగ్గురు మాత్రమే ఉన్నారు. గోల్కొండ ఆసుపత్రిలో ఆరుగురికి ఇద్దరే ఉన్నారు. మలక్‌పేట ఏరియా ఆసుపత్రిలో ఏడుగురు వైద్యులకు ఇద్దరు మాత్రమే ఉండటం గమనార్హం. మరీ ముఖ్యంగా పిడియాట్రిక్స్, అనస్తీషియా విభాగాల్లో ఖాళీలు ఉండటం మూలానా అత్యవసర సమయాల్లో తీవ్ర ప్రభావం చూపుతున్నది.